డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

## కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 3: డీఎస్సీ మెరిట్ సాధించిన అభ్యర్థులకు సంబంధించి 1:3లో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థుల ధ్రువపత్రాలను స్థానిక సేయింట్ ఆంథోనీస్ పాఠశాలలో రెండో రోజు గురువారం పరిశీలించారు. ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి సందర్శించారు. అభ్యర్థులతో కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెండోరోజు ధ్రువపత్రాల ఎస్‌జీటీ విభాగంలో 765 మంది అభ్యర్థులకు 475 మంది, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 240 మంది అభ్యర్థులకు 60 మంది ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిందన్నారు. రాష్ట్ర పరిశీలకుడు, పరీక్షల విభాగం సంచాలకుడు కృష్ణారావు, విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

## సంగారెడ్డి రూరల్ సీఐ, ఎస్ఐపై బదిలీ వేటు

కంది, అక్టోబర్ 3: సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ అశోక్, ఎస్ఐ వినయ్‌కుమార్‌లపై బదిలీ వేటు పడింది. వీరిద్దరిని వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఐజీ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి, కంది మండలాల్లో కొనసాగుతున్న అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవడంలో విఫలమయ్యారని వీరిపై ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇసుక అక్రమ రవాణా కట్టడి చేయకపోవడంతోపాటు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం, అక్రమార్కుల నుంచి మామూళ్లు వసూళ్లు చేస్తున్నట్లు ప్రభుత్వానికి నివేదిక అందింది. ఈ క్రమంలో ఐజీ నిర్ణయం తీసుకున్నారు.

సదాశివపేట: సర్వే చేస్తున్న అధికారులు

జిన్నారం: మంగంపేట గ్రామంలో..

## ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ సర్వే ప్రారంభం

సదాశివపేట, అక్టోబర్ 3: పట్టణంలోని 26వ వార్డులో మున్సిపల్ కమిషనర్ ఉమ ఆధ్వర్యంలో గురువారం ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను నిర్వహించారు. సర్వేలో ప్రస్తుతం మాన్యువల్‌గా వివరాలు తీసుకుని అనంతరం డిజిటల్‌లో నమోదు చేస్తామని తెలిపారు. ప్రజలందరూ సర్వేకు సహకరించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రాజేశ్ పాల్గొన్నారు.

**ప్రతి ఇంటికీ ఫ్యామిలీ కార్డు**

జిన్నారం, అక్టోబర్ 3: రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ప్రతి కుటుంబానికి డిజిటల్ ఫ్యామిలీ కార్డు ఇవ్వడానికి గ్రామాల వారీగా సర్వే చేస్తున్నామని ఐఏఎస్, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి హరిచందన తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన మంగంపేట గ్రామంలో గురువారం అధికారులు చేపట్టిన సర్వేను పరిశీలించారు. తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో అరుణా, ఎంపీవో రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీలత బృందాలుగా ఇంటింటి సర్వే చేస్తున్నారు. ఈఆర్‌వో దేవూజా, అధికారులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం అందించాలి

అందోల్, అక్టోబర్ 1: అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వర్తించాలని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్ ఆదేశించారు. గురువారం చింతకుంట గ్రామంలో పర్యటించిన ఆయన అంగన్‌వాడీ కేంద్రం. పాఠశాల, ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. పాఠశాల లో విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మంచి భోజనం అందించడంతోపాటు వారికి కావాల్సిన వసతుల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేసి సౌకర్యాలపై ఆరాతీశారు. ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో అశోక్, ఎంఈవో కృష్ణ ఉన్నారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

గుమ్మడిదల, అక్టోబర్ 3: శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు వేదపండితులు అంకురార్పణ చేశారు. గురువారం నుంచి మంగళవారం వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలను స్వస్తి వచనముతో ప్రారంభించారు. ఆలయ వంశపారంపర్యక ధర్మకర్త కేవీ నర్సింహాచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, ధర్మకర్తల ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి ఆహ్వానప్రతిక అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ధర్మకర్తలు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఉత్సవాలకు ఆహ్వానం

బొల్లారం, అక్టోబర్ 3: మున్సిపాలిటీ పరిధిలోని దుర్గాదేవి ఆలయంలో నిర్వహించే దేవీ నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌ను బొల్లారం నాయకులు గురువారం ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక నాయకులు వరప్రసాద్ రెడ్డి, మా అంబి మహిళా సేవ సమితి సభ్యులు దీనానాద్, శ్రీమన్నారాయణ, రాజారామ్, చంద్రశేఖర్, ఉద్యానంద్, తివారి, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

## శోభాయమానంగా కలశయాత్ర

బొల్లారం, అక్టోబర్ 3: బీహార్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన మహిళలు దేవీ నవరాత్రుల సందర్భంగా మాఅంబి మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన వీధుల్లో కలశ యాత్ర ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మహిళలతో కలిసి భక్తిశ్రద్ధలతో కలశాలను తలపై పెట్టుకొని అమ్మవారికి సమర్పించారు. అనంతరం స్థానిక దుర్గామాత ఆలయంలో చంద్రారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు కౌన్సిలర్ చంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మా అంబి మహిళా సేవా సమితి సభ్యులు దీనానాద్, దుర్గాదేవి, ప్రత్యూష రెడ్డి, రాజారాం, శ్రీమన్నారాయణ, చంద్రశేఖర్, ఉద్యానంద్, తివారి, శ్రవణ్ పాల్గొన్నారు.



కలశ యాత్ర ఊరేగింపులో కౌన్సిలర్ చంద్రారెడ్డి దంపతులు

## బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

**అమీన్‌పూర్, అక్టోబర్ 3:** అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో బతుకమ్మ సంబురాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం కాలనీల్లో మహిళలు పెద్దఎత్తున బతుకమ్మలను ఒకదగ్గర చేర్చి ఆటపాటలతో సందడి చేశారు.

# ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఘన స్వాగతం



పటాన్‌చెరు: ఎమ్మెల్యే హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న నాయకులు



కోహీర్: కవేలిలో హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు



జహీరాబాద్: ముత్యాల చందు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

పటాన్‌చెరు, అక్టోబర్ 3: సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు ఇస్నాపూర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. గురువారం నగరంనుంచి జహీరాబాద్ పర్యటనకు బయలుదేరిన హరీశ్‌రావుకు ఇస్నాపూర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్‌గౌడ్, పాశమైలారం మాజీ సర్పంచ్ మోటే కృష్ణ, బీఆర్ఎస్ యువత రాష్ట్ర నాయకులు మెరాజ్‌ఖాన్‌లు పటాకులు కాల్చి ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. పార్టీ శ్రేణులకు హరీశ్‌రావు అభివాదం చేసి, పార్టీకి పూర్వవైభవం రాబోతున్నదని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు నవీన్‌రెడ్డి, తలారి శంకర్, వీరేశ్‌గౌడ్, చందు ముదిరాజ్, జనార్దన్‌రెడ్డి, నారాయణదాస్, గోపాల్, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కోహీర్‌లో..**

కోహీర్, అక్టోబర్ 3: మండలంలోని కవేలి గ్రామ 65వ జాతీయ రహదారిపై గురువారం మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు ఘన స్వాగతం పలికారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు నర్సింహులు, పీఏసీఎస్ చైర్మన్ ప్రవంతిరెడ్డి, కలీం, ఆనంద్, నర్సింహులు, తదితరులున్నారు.

**బాధిత కుటుంబాలకు పరామర్శ**

జహీరాబాద్, అక్టోబర్ 3: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జహీరాబాద్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ముత్యాల చందు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్‌రావు, నాయకులు నామర వికిరణ్, అశోక్‌చేరి, యాకుబ్ ఉన్నారు.

**మాజీ కార్పొరేటర్ సతీమణికి..**

రామచంద్రాపురం, అక్టోబర్ 3: ఆర్సీపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య సతీమణి గిరిజారాణికి ఇటీవల గుండె ఆపరేషన్ జరిగింది. విషయం తెలుసుకున్న హరీశ్‌రావు ఆర్సీ పురంలోని తొంట అంజయ్య నివాసానికి వచ్చి ఆయన సతీమణి గిరిజారాణిని పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**వండర్ వాష్ సర్వీసు ప్రారంభం**

సంగారెడ్డి, అక్టోబర్ 3: వాహనాలకు వాటర్ వాష్ చేసేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన వండర్ వాష్ సర్వీసింగ్ కేంద్రాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. కలెక్టరేట్ ఎదుట సదాశివపేట మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రోళ్ల చిన్న ఏర్పాటు చేసిన వాటర్ వాష్ సెంటర్‌ను ప్రారంభించారు.

రామచంద్రాపురం: గిరిజారాణిని పరామర్శించిన మాజీ మంత్రి హరీశ్‌రావు



సంగారెడ్డి: వండర్ వాష్ కేంద్రాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి హరీశ్‌రావు



జహీరాబాద్‌లోని ఎస్వీ షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న సినీ హీరోయిన్ రాశిఖన్నా

## ఎస్వీ షాపింగ్ మాల్‌లో రాశీఖన్నా సందడి

జహీరాబాద్, అక్టోబర్ 3: జహీరాబాద్ పట్టణంలోని ఎస్వీ షాపింగ్‌మాల్‌ను గురువారం ప్రముఖ సినీ హీరోయిన్ రాశీఖన్నా నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె వివిధ రకాల వస్త్రాలను ధరించి కనువిందు చేసింది. రాశిఖన్నాను చూసేందుకు భారీగా తరలివచ్చిన అభిమానులతో షాపింగ్‌మాల్ పరసరాలు సందడిగా మారాయి. అభిమానులను కలవడం ఆనందంగా ఉందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, చంద్రశేఖర్, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి అవదూత గిరిమహారాజ్, షాపింగ్‌మాల్ నిర్వాహకులు అల్లాడీ నర్సింలు, అనిల్‌జాజు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు అరికట్టాలి

పటాన్‌చెరు, అక్టోబర్ 3: ఇంద్రేశం గ్రామంలో అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయని మాజీ ఇన్‌చార్జి సర్పంచ్ బండి హరిశంకర్ ఆరోపించారు. గురువారం మండలంలోని ఇంద్రేశం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో కార్యదర్శి నిర్లక్ష్యంపై మండిపడ్డారు. గ్రామంలో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. పంచాయతీలో నిధులు లేవని కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించడం లేదన్నారు. రోడ్డుపై తాను అడ్వర్టయిజ్ సంస్థ ఏర్పాటు చేసిన హోర్డింగ్‌పై తన ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తే తొలిగించి మరో రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, దామోదర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

**అక్రమ నిర్మాణాలను తొలిగిస్తాం**

ఇంద్రేశం పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలను గుర్తించామని ఇంద్రేశం కార్యదర్శి తెలిపారు. తనపై మాజీ సర్పంచ్ ఆరోపణలపై వివరణ ఇచ్చారు. గ్రామ పరిధిలో ఇప్పటికే నాలుగు ఆక్రమణలను కూల్చివేసినట్లు తెలిపారు. మరికొన్ని ఆక్రమణలను గుర్తించి నోటీసులిచ్చామన్నారు. త్వరలో వాటిని నిబంధనల మేరకు కూల్చివేస్తామన్నారు. ఫ్లెక్సీ వివాదంతో తనకు సంబంధం లేదని తెలిపారు.

మాట్లాడుతున్న ఇంద్రేశం మాజీ ఇన్‌చార్జి సర్పంచ్ బండి హరిశంకర్

## ఆలయ స్లాబ్ నిర్మాణానికి హామీ

జిన్నారం, అక్టోబర్ 3: జిన్నారం శివారులోని తాబేలు గుట్ట మీద నూతనంగా నిర్మిస్తున్న జీవన జ్యోతిర్లింగ శివాలయ నిర్మాణాన్ని బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్ అంతిరెడ్డి అనిల్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి గురువారం సందర్శించారు. ఆలయ స్లాబ్ నిర్మాణానికి అవసరమైన రూ.6 లక్షల విలువైన కాంక్రీట్‌ను అందజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కమిటీ సభ్యులు ఆలయ నిర్మాణ ప్రాంగణంలో అనిల్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, భిక్షపతిచారి, గాండ్ల శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, ప్రభాకర్, అనిల్‌రెడ్డి, మహేందర్, భాస్కర్, రాజు, ఫణిభూషణ్, లక్ష్మణ్‌గుప్తా, ఆంజనేయులు పాల్గొన్నారు.

## న్యాయవాదిపై దాడిని నిరసిస్తూ రాస్తారోకో

సంగారెడ్డి, అక్టోబర్ 3: నాంపల్లి కోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయవాది ఎండీ అబ్దుల్ కలీమ్‌పై పోలీసుల దాడిని నిరసిస్తూ తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు న్యాయవాదులు విధులు బహిష్కరించి రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. గురువారం పట్టణంలోని జిల్లా కోర్టు ఎదుట ప్రధాన రహదారిపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని, అబ్దుల్ కలీమ్‌పై దాడి చేసిన పోలీసులపై చట్ట పరమైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ క్రీడల కార్యదర్శి అశోక్, గ్రాంథాలయ కార్యదర్శి ఆంజనేయులు, సభ్యులు జ్ఞానోభా, వినోద్‌కుమార్, విజయ్‌కుమార్, పెంటయ్య, మహిళా ప్రతినిధి లలిత ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కంది, అక్టోబర్ 3: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి కంది మండల పరిధిలోని కేశవరెడ్డి స్కూల్ ఎదుట చోటు చేసుకుంది. సంగారెడ్డి రూరల్ పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. కంది మండలం చిమ్నాపూర్ గ్రామానికి చెందిన ఏర్పుల నవీన్(27) ఐఐటీ హైదరాబాద్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని బైక్‌పై చిమ్నాపూర్‌కు వస్తున్న క్రమంలో వీధి కుక్కలు బైక్ ముందుకు దూసుకురావడంతో నవీన్ కింద పడిపోయాడు. తల, చాతి భాగానికి బలమైన గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఉస్మానియా దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య ఏర్పుల శిరీష ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మున్సిపల్ కార్మికులకు బట్టలు పంపిణీ

అందోల్, అక్టోబర్ 3: అందోల్-జోగిపేట మున్సిపల్ కార్మికులకు గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ అనంతరెడ్డి సహకారంతో బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కమిషనర్ తిరుపతి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు సేవలు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతీ సంవత్సరం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేస్తున్నారని మెచ్చుకున్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా కార్యదర్శులు రాంబాబు, పద్మనాభారెడ్డి, క్లబ్ బాధ్యులు సంతోశ్, మాణిక్‌రెడ్డి, జగదీశ్వర్, దయానంద్, జాన్ పాల్, మాజీ సర్పంచ్ అనిల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్ పాల్గొన్నారు.

జోగిపేటలో మున్సిపల్ కార్మికులకు బట్టలు అందజేస్తున్న నాయకులు, అధికారులు

## తొలి రోజు 'ఓపెన్' పరీక్షలు ప్రశాంతం

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 3: ఓపెన్ స్కూల్ ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఉదయం జరిగిన ఇంటర్మీడియట్ ఉర్దూ పరీక్షకు మొత్తం 217 మంది అభ్యాసకులకు 169 మంది హాజరయ్యారు. 48 మంది గైర్హాజరు కాగా 78 హాజరు శాతం నమోదైంది. ఎస్ఎస్సీ తెలుగు పరీక్షకు 47 మంది అభ్యాసకులకు 34 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరయ్యారు. 72 శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్నం జరిగిన ఇంటర్మీడియట్ అరబిక్ పరీక్షకు 13 మంది అభ్యాసకులు హాజరు కావాల్సి ఉండగా, 10 మంది హాజరయ్యారు.

## 7న రేషన్ బియ్యానికి వేలంపాట

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 3: పలు సందర్భాల్లో జప్తు చేసిన రేషన్ బియ్యాన్ని ఈ నెల 7న సాయంత్రం 4 గంటలకు బహిరంగ వేలం వేస్తామని కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం ప్రకటనలో తెలిపారు. అక్రమార్కుల నుంచి జప్తు చేసిన 2,966.70 క్వింటాళ్ల బియ్యం గోదాంలో నిల్వ చేసినట్లు తెలిపారు. ఆసక్తి గల బీవరేజెస్, డిస్టిలరీ సంస్థలు స్టీల్ కొటేషన్లలో రాత పూర్వకంగా పత్రాలతో సమర్పించాలని, అదే రోజు 4 గంటలకు కొటేషన్లు తెరవనున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ ద్వారా గుర్తింపు పొందిన బీవరేజెస్, డిస్టిలరీ సంస్థల ప్రతినిధులు వేలం పాటలో పాల్గొని సరైన ధరకు బియ్యం పొందవచ్చన్నారు. సరైన ధర రాకపోతే వేలం రద్దు చేసే అధికారం కలెక్టర్‌కు ఉంటుందన్నారు.

## ఖాజీపల్లిలో వైద్య శిబిరం

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

జిన్నారం, అక్టోబర్ 3: ఖాజీపల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలో గురువారం ఆర్‌వీఎం దవాఖాన వైద్యులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్, న్యాయవాది దండే రమాకాంత్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో కంటి పరీక్షలు, సాధారణ వైద్య సేవలు, మోకాలు, కీళ్ల నొప్పులు, గుండె పరీక్షలు, రక్త పరీక్షలు, ఈసీజీ నిర్వహించారు. 300 మందికి వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. దృష్టిలోపం ఉన్న వారికి కంటి ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. శుక్రవారం ఖాజీపల్లి పంచాయతీ పరిధిలోని జీఎంఆర్ కాలనీలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం

రామచంద్రాపురం, అక్టోబర్ 3: ఓల్డ్ ఆర్సీపురంలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహిస్తామని గ్రంథాయ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకుడు తాళ్ల కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం ఓల్డ్ ఆర్సీపురంలోని పోచమ్మ ఆలయం ఆవరణంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులతో సమావేశమయ్యారు. 10వ తేదీన బతుకమ్మ వేడులను నిర్వహించాలని ఆలయ పూజారి సూచించడంతో దానికి అందరూ సమ్మత్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఓల్డ్ ఆర్సీపురం రాయసముద్రం చెరువు కట్టపైన ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు.

## గాయపడ్డ కార్మికుడికి ఆర్థికసాయం

బొల్లారం, అక్టోబర్ 3: వలస కార్మికుడి ఆరోగ్య పరిస్థితిని చూసి చలించిన స్థానిక సంఘ సేవకుడు ఆనంద్ కృష్ణారెడ్డి అండగా నిలిచారు. బీహార్‌కు చెందిన రామచందర్ యాదవ్(56) ఓ పరిశ్రమలో పనులు నిర్వహిస్తూ చేతికి గాయం కావడంతో పరిశ్రమ యాజమాన్యం చికిత్స చేయించి వదిలివేశారని, దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయని వాపోతూ ఆనంద్ కృష్ణారెడ్డిని ఆశ్రయించాడు. ఈ సందర్భంగా ఆనంద్ కృష్ణారెడ్డి సదరు పరిశ్రమ కాంట్రాక్టర్‌తో చర్చించి కార్మికుడికి ఒక నెల వేతనం ఇవ్వాలని, వైద్య ఖర్చులకు రూ.20 వేలు సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. తక్షణ సాయంగా కాంట్రాక్టర్ రూ.10 వేలు బాధితుడికి అందించేలా చొరవ తీసుకున్నారు.

కోహీర్: గురుజువాడలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సదాశివపేట: అమ్మవారికి పూజలు చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ శివరాజ్ పాటిల్

జిన్నారంలో..

గుమ్మడిదల: బాలా త్రిపుర సుందరిదేవీగా అమ్మవారు

## భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రులు

**దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఊరూరా వెలిసిన మండపాల్లో దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు బాలత్రిపుర సుందరిదేవీగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలు మండపాల వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.**

**- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, అక్టోబర్ 3**

రామచంద్రాపురం: మల్లికార్జుననగర్‌లో..

అమీన్‌పూర్: పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి దంపతులు

రామచంద్రాపురంలో..

బొల్లారం: పూజలు చేస్తున్న మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి దంపతులు